అంతిమంగా గెలుచుకోరన్న...
అనుమాన పడక ప్రజలరాజ్యం నిలుపుకోరన్న!!
ముక్తిపోరుల ముందుకురకన్న!!
శత్రుబలమూ క్షుద్రమేరా
చీలిపోయి వున్నరయ్యో
ఏకమయ్యి పేదలంత
కొత్తదెబ్బ కూల్తడయ్య
ఎర్రదండుతో కలిసికదలన్న
అనుమాన పడక ముక్తిపోరుల!!
అటు దూరంగా-ఊరిదిక్కు నుంచి
"గార్డ్ హోశియార్!
...ఖమ్ కౌన్ ఆతాహై...! వినబడ్తుంది పోలీసుల కేక.

మంచె దిగి అడివిదిక్కు నడువసాగిండు చిన్నన్న. గోదావరిలో అప్పుడప్పుడు చాపలెగరంగ 'బుడుక్' మనిసప్పుడు వినబడ్తుంది.

వేగుచుక్క బారెడెక్కింది.

## బోనస్

పులుగు శ్రీనివాస్

ఆ రాత్రి...గాఢమైన చీకటి రాత్రి...

దట్టమైన నల్లని పొగమంచు, ఆకాశాన్నంతా కప్పుకు పోయినరాత్రి...

ఎక్కడో దూరాన ఓ కుక్క 'బోరు'న ఏడుస్తోంది ఫ్యాక్టరీ ధ్వనుల్ని చీలుస్తూ చుక్కలు - చెమర్చిన కన్నీటి చుక్కల్లా మెరుస్తూ మిణుకు మిణుకు మంటున్నాయి. అక్కడక్కడ గుడ్డిగా వెలుగుతున్నయి లైట్లు దీనంగా.

ఆకాశం నించి - ఏ ఆశా పొందలేని దిక్కులు, చీకట్లతో బావురు మంటున్నాయి.

భూమి - తన ప్రకృతి ధర్మాన్ని నిర్దేశిస్తోంది. మనుషుల్లో - క్రూరత్వాన్నీ తారతమ్యాన్నీ, మోసాల్నీ, అన్యాయాల్నీ కసిగా ఉసిగొల్పుతోంది.

భయంకరమైన చీకటి సత్యాల్ని నిర్దయగా కాలరాస్తోంది.

వాణికిస్తున్న ఆ చల్లని గాలిలో ... ఎవరూ లేని ఆ రోడ్డుమీద ... అంత రాత్రి...పిచ్చిగా పరుగులుతీస్తున్న అడుగులు... శారీరక బలాన్నీ, మానసిక స్తిమితాన్నీ కోల్పోయి, గుక్క తిప్పుకోలేని వెక్కిళ్ళతో, కన్నీళ్ళతో - చంకలో పాపతో, పిల్లలతో—చొక్కిపోతూ, సోలిపోతూ, ఊగిపోతూ—పిచ్చిగా...పిచ్చి పిచ్చిగా...పరుగులు తీస్తున్న స్త్రీ అడుగులు-

'దబ్...దబ్...దన్...దన్...' ఫ్యాక్టరీలమోత.

నల్లతాచు లాంటి గొట్టాల్లోంచి వెలువడే పొగ – నాలుకలు చాచి విషం కక్కుతూ చీకట్లో కలిసి పోతోంది.

ట్యూబులైట్ల వెల్తుర్లో మిలమిల మెరుస్తున్న "విజయా కేబుల్స్ (ప్రయివేట్) లిమిటెడ్" బోర్డుముందు - ఒక్కసారి... అణుచుకున్న వుద్వేగమంతా పేలిపోయినట్లు, గేటు చువ్వల్లోంచి ఏడుస్తూ, వూపుతోందా స్త్రీ.

చంకలోంచి పాప ఎలా జారిపోయిందో—కిందబడి ఏమైందో తెలీనట్లూ... మిగిలిన పిల్లలు తన్నుచూసి ఎలా భయపడి భయంకరంగా అరుస్తున్నారో పట్టనట్లు...ప్రతిసారీ...వొంగి వొంగి...వూడ్చి వూడ్చి దుమ్మెత్తి పోస్తోంది. అర్థం కాని ఆవేశంతో. తన్నింత వరకూ పట్టించుకోని మనుష్యుల్ని అసహ్యించు కుంటోంది. బూతులు తిడుతోంది నిస్సహాయంగా.

"మీ మీన మన్నుబొయ్యరో..."

"మీ దినాలు, వారాలు గానురో..."

"మిమ్మెల్నెత్తుక, కట్టుక జోనురో..."

"ఓర్ లంజకొడుకుల్లారో!...తలుపుల్దియ్యిర్రో..."

ఒకటే అరుపులు.

## 2

"చంద్రంసాబ్!..."అన్నాడు అటెండర్. 'చంద్రంగారూ! మిమ్మల్ని మేనేజర్గారు పిలుస్తున్నారు.' అన్నట్లు.

"నన్నా" అన్నాడు చంద్రం ఆశ్చర్యంగా.

"హా"నంటూ వెళ్ళిపోయాడు అటెండర్

ఆశ్చర్యంనించి తేరుకుని, ఆలోచన్లో పడ్డాడు చంద్రం.

"మర్లేమైనా తప్పుడు సాక్ష్య మిప్పించి, ఎవర్నైనా పన్లోంచి తీసెయ్యడు గదా! ఏ చిక్కుల్లోకి తోయడు గదా!!

పాపం! కరీం కెంత అన్యాయం జరిగిందని!· ఆ రోజు ... గుండెలవిసేలా బాధపడ్డాడు. "తనకేం తెలీదనీ, తన్ను తీసెయ్య కండనీ" మేనేజర్ కాళ్ళపైబడి

గొంతుపగిలేట్టు ప్రాధేయ పడ్డాడు.

"అతన్ని ఊస్ట్ చేసిన రోజున— తనావిషయం పూర్తిగా తెలిసికోక ముందే, మేనేజ్‌మెంట్ తొందర పెట్టడంవల్లా, ఆ ఇద్దరి నాయకులపై నమ్మకంవల్లా, ఏం చేయలేక తలూపాల్సొచ్చింది.

"వరుసగా నాలుగు మిషన్స్‌లో పి.వి.సి. ముక్కలతో కలిపి మేకులు వేశాడనీ, అవెందుకూ కొరగాకుండా పోయాయనీ, ... అంత నష్టాన్ని తెచ్చిన మోస గాణ్ని - మరీ పన్లోకెక్కించుకుని, వ్యాపారాన్ని చెడగొట్టుకోకుండా, వెంటనే తీసేస్తున్నాననీ—....గొంతుచీలేలా, ఆగకుండా అరగంటసేపు అరుస్తూ యెగిరెగిరి పడ్డాడు మేనేజర్.

"కానీ—నిజం ఆలస్యంగా తెలిసింది. కరీం చెల్లి—ఫోర్‌మన్ డబ్బుకి లొంగలేదనీ...అతని పశుత్వంపైకి చెప్పు విసిరిందనీ...ఆ రోజునించి అసలు విషయం ఎవరికీ చెప్పకుండా పని మానేసింది. ఫోర్‌మనే మనుష్యులతో చిన్న మేకులు వేయించీ, రెండ్రోజులు మిషన్స్ ఆపు చేయించీ, పెద్దగా గొడవలేపాడు. బెంగుళూరు నించి స్పెషల్ మెకానిక్‌లను పిలిపించాననీ, అన్నీ కొత్తపార్ట్సే వేయించాననీ, అందుకు చాలా డబ్బు ఖర్చయిందనీ-నానా అబద్ధాలాడాడు.

దీని వెనుక మేనేజర్ హస్తం వుండకుండా వుండదని అన్పించింది. తన భార్య కమలకీ విషయం చెప్పినప్పుడు, ఆమెకళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. జరిగిన యీ అన్యాయానికి ఎంతగా అంగలార్చిందనీ "తమ బతుకులు కూడా ఎప్పుడో ఒకప్పుడు అలాంటి అన్యాయానికి గురై చితికి పోవాల్సిందేకదా? "అని ఎంతగా కుమిలిపోయిందని.........!"

ఒక్కసారి భారంగా నిట్టూర్చాడు చంద్రం.

"అయ్యో! వెళ్ళాలికదా?" అనుకుని, తన మిషన్నొక మారు చూసుకున్నాడు-బాగానే నడుస్తుంది... ఇప్పుడే తీగెం ఐపోదు......

"అరే రంగా! మాల్ (పి.వి.సి. ముక్కలు) ఐపోంగనే మళ్ళనింపు. జాగర్తగా సూత్తుండు...జెప్పునమల్లొత్తగనీ...ఆఁ..." అంటూ తన హెల్పర్‌కి చెప్పి వెళ్ళిపోయాడు చంద్రం.

మేనేజర్ గది ముందుకెళ్ళి, తలుపు అద్దంలోంచి చూశాడు లోపలికి. "నీ కోసమే చూస్తున్న!" అన్నట్లు తలనొకమారు ముందుకు కదిలించాడు మేనేజర్.

స్ప్రింగ్ డోర్‌ని నెమ్మదిగా నెట్టుకుని లోపలికెళ్ళి-వినయంగా నమస్కరించి నించున్నాడు చంద్రం.

మేనేజర్- చూడ్డానికి సన్నగా, పొడుగ్గా అందంగా వుంటాడు: కళ్ళ

ల్లోంచి వచ్చే చూపుల్ని తీక్షణంగా ఒకే దగ్గర ప్రసరిస్తే-యెదుట నించున్న మనిషికి తేళ్ళూ, జెర్రులూ పాకినట్లుంటుంది.

అతడి నోటినించి వచ్చే ప్రతీమాటా దాదాపు 420 కిలోవాట్స్ శక్తితో-360 క్వింటాల్స్ బరువుతో మీద బడినట్లుంటుంది.

కానీ-అతడి అవసరాన్నిబట్టీ, ఎదుటి మనిషి భీరుత్వాన్నిబట్టీ పాటినుపయోగిస్తూ వుంటాడు.

చిన్నగా నవ్వుతూ– "ఏం లేదురా చంద్రం! ఈ సంవత్సరం బోనస్ విషయం మాట్లాడుదామని పిలిపించాను. ఈ షిఫ్ట్ లీడర్‌వి. నీతో చెప్పాలికదా!... ఇంతకుముందే మన సేట్ ఫోన్ చేశారు. –'బోనస్ 10%ఇవ్వమని' లాస్టియర్ చెప్పాంకదూ? ఈ ఏడు యివ్వలేక పోతున్నా మళ్లీ వచ్చేఏడు తప్పకుండా20% ఇస్తామని" కాని ఇవ్వలేక పోతున్నందుకు విచారిస్తున్నాంరా! ఎంత ప్రయత్నించినా కుదర్లా. అంతగా లాభాలురాలా, నష్టాల్లోనే నడుస్తుంది ఫ్యాక్టరీ. అలాంటప్పుడు మేంవేం చేయగలం చెప్పు?... మీరుబాగా కష్టపడి పంచేస్తే వచ్చే సంవత్సరం తప్పకుండా యిస్తాం. ఈ విషయం అందరికీ చెప్పి, మళ్లీ సాయంత్రం కన్పించు..." అంటూ మేనేజర్ తన పైళ్ళ అడివిలోకి దూరిపోయాడు పులిలా. ఏం తోచని చంద్రం–మళ్ళీ తిరిగి రావాల్సిన ఆవులా వెళ్ళిపోయాడు.

తన మిషన్ దగ్గరకెళ్ళి తడిమి చూసుకున్నాడు చంద్రం సాలోచనగా. బాగుంది...ఒక్క వైర్ కట్టవుతే, తనచేతినరం తెగినంత బాధ పడుతాడు. ఏ పనైనా మనస్ఫూర్తిగా చేస్తాడు. "మనం చేసే ప్రతీపనికీ న్యాయం చేకూర్చాలం"టాడు అమాయకంగా.

చంద్రం ఆలోచనలు–తన పెద్దకూతురివైపు మళ్ళాయి. "పెద్దదయి నాలుగేళ్ళయిండె. ఆడపిల్లల్ని ఎక్కువకాలం ఇంట్లో వుంచుకోవడం అంత మంచిది కాదంటారు. దాని పెళ్ళి చేసి పంపిస్తే తన నెత్తిమీద బరువు సగం దిగిపోయినట్లవుతుంది. చివరిదాని పెళ్ళికిప్పుడేం తొందరలేదు. చాలా చిన్నపిల్ల. మిగిలి నిద్దరూ మగపిల్లలు. వాళ్ళెలాగూ బతగ్గలరు, ఏ కూలోనాలో చేసుకుని. "ఇప్పుడు దొరక్కదొరక్క మంచి సంబంధం దొరికింది. అది తప్పిపోకుండా యీ ఆషాఢ మాసంలోనే పెళ్ళిచేయాలని నిశ్చయించుకున్నాడుకూడా." ఐతే...తన వూహలు నిలువునా కూలి పోయాయి.

## 3

"గిర్.......ర్......ర్" న బెల్ మోగింది.

లంచ్ టైమ్.

అందరూ– పంపు దగ్గర చేతులు కడుక్కుంటున్నారు.

చంద్రం—కొంచెం ఆలస్యంగా బయటికొచ్చాడు.

మొహం విచారంగా వుంది.

"యేంభాయ్! అట్లున్నవ్? మేనేజర్ పిల్సినట్టుంది. యేం జెప్పిండేంది?" అంటూ అందరూ చుట్టుముట్టారు.

ఉలిక్కిపడిన చంద్రం తేరుకుని, "యేం లేదు భాయ్ మనందరం ఆశపడ్డదంతా వొట్టిదేఐంది. "సరింగ లాబాలు రాలేదనీ, ఈ యేడుగూడా 10% బోనసే యిత్తాననీ—యింగేం మాట్లాడకుంట దీసుకుని, ఇగనుంచైనా కస్టపడి పంజేత్తే—మళ్లొచ్చే యేడు ఎక్కువిత్తననీ"...సెప్పిండు. అంతే..." అన్నాడు ఓ విధమైన చిరాకుతో.

"ఇగనుంచైనా కష్టపడాలంటే...మనవీ సమచ్చరం కస్టపల్లేదనా వీసత్తం? యేమైనా యీతాప వీసంతుసూడాలింగా." అన్నాడు జాన్ కోపంగా.

"పెతీయేడు యేవో తాంపులుజెప్పి తప్పిచ్చుకుంటాడు. నేనిన్నేండ్లాయెగాని పంజేయబట్టి. ఒక్కతాపగూడ పిడికెడు పైసల్దీసుకోలే వీంతాన. ఈ తాప మాత్తరం వూరుకునేది లేదు..." అన్నాడు మల్లయ్య బొంగురుబోతున్న కంఠంతో.

"యేంది! వీనింట్లకెల్లిత్తాండట్నా? యేకుపుగొట్టు లంజ కొడుకు! సమచ్చరమంతా కస్టపడి లచ్చలరూపాయల్లాభం దెత్తే-వీడిచ్చేది 10% బోనసట్నా? సీ సిగ్గు లేదు వుండకోరు ముండకొడుక్కు......అరే! వీని కూకుంటాంటె బాగ లాగనైతాందిరో!......" అన్నాడు రాజన్న. ఆవేశాన్నింకా ముందుకుతీసికెళ్ళి మండిపడ్తూ.

"ఇగో! సెంద్రన్నా! నువుగనక దానికొప్పుకుంటే- మమ్ముల్నందర్నీ అన్యాయం జేసినోనివైతవ్. మనం నిజంగా రాత్రనకా పగలనకా కష్టపడతలేవా? మీమున్గురు లీడర్లు గట్టిగ నిలబడుండ్లి; ఎనుకమేంవుంటంగని. అక్కెరైతే స్ట్రైకు జేసి పని మానేద్దాం, గని-మీరు పట్టు సడలింద్రో... మేమంతా వుత్తోల్లమైతం, "మేమంతా వొప్పుకుంటలేమనీ, తప్పకుంటా 20% బోనసియ్యాల్సిందేననీ, ముందటేడోలె యీయేడేం జాగదనీ... గట్టిగజెప్పుబోయి......" అని తుది నిర్ణయమిచ్చాడు జోగులు, పక్క కంపెనీలో మొదలైన స్ట్రైకును గుర్తుచేసుకుంటూ.

ఇలా తలా వొక మాటలో-తమ తమ కోపాల్ని, అవసరాల్ని, దీనత్వాల్ని బాధల్ని...తెలియజేశారు.

చంద్రం సాంతంగా విన్నాడు. విని అర్థం చేసుకున్నాడు. తన బతుక్కంటే వాళ్ళవేం మెరుగ్గాలేవన్న సంగతి అతనికి తెలుసు. పట్టుదలగా పిడికిళ్ళు బిగించి, యేదోస్థిరంగా నిర్ణయించుకున్న వాడిలా ఒక్కడుగు ముందుకేసి "నేను

గబ్బే అనుకున్న. ఈ యేడు వీంతో తాడో పేడో తేల్చుకోంది యిడిసిపెట్టేదిలేదు. నేనిప్పుడే బోయి సెప్పొత్త. మీరు తిని మీపండ్లోకి మీరు బోండ్లి. వాడినకుంటె యెనుకసీరి సూద్దంగని......" అంటూ చెంద్రం గబగబా వెళ్ళాడు మేనేజరు గదివేపు.

## 4

"ఈరోజు సాయంత్రం 5 గంటల 30 ని॥లకు ఆఫీసు గదుల వెనుకున్న పార్కులో మీటింగుంటుంది. మేనేజరుగారు మాట్లాడుతారు... మీరంతా హాజరు కావాలి!!..." అని ప్రకటించారు, ప్రతీ సెక్షన్‌లోని సూపర్‌వైజర్లు.

బోనస్ గురించే మాట్లాడతాడన్న విషయాన్ని అందరూ వూహించగలిగారు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగిపోయి, వారి వారి పనుల్లో నిమగ్నులయ్యారు.

చంద్రం ఆలోచనలు తీవ్రరూపం దాల్చాయి. అతడి కళ్ళు ఏకదీక్షగా తన మిషన్ని పరిశీలిస్తున్నాయి.

తీగ-ఒకగిట్ట (తీగ చుట్టబడిన పరికరం) నించి వెలువడుతూ, ఎర్రగా కాలే మిషన్‌లో, చిక్కని ద్రవంగా వున్న ప్లాస్టిక్‌ని పూసుకుని, చల్లని వాటర్‌ట్యాంక్‌లో గట్టిపడి, రెండోగిట్టకి చుట్టుకుంటోంది ఇన్సూలేషన్ వైర్‌గా.

పక్కమిషన్-ప్లాస్టిక్ పౌడరుని పి. వి. సి. ముక్కలుగా తయారుచేసి, దీనికి సరఫరాచేస్తోంది. ముందుసెక్షన్‌లో-పూర్తిగా తయారైన వైర్‌ని ఆడవాళ్ళు ప్యాకింగ్‌చేసి లారీవాళ్ళ కందిస్తున్నారు.

వెనక సెక్షన్స్‌లో—తీగను శుభ్రం చేయడం, ట్విస్టింగ్‌చేయడం, గిట్టలకి చుట్టడం జరుగుతోంది.

కరెంటు ఆధారంతో నడిచే మిషన్లూ-మీటలకలవాటుపడ్డ చేతులూ, బరువుల కలవాటుపడ్డ తలలూ, మాటలకలవాటుపడ్డ మనసులూ, అనుకోకుండానే ఆలోచన లేకుండానే పనులని నిర్వర్తిస్తున్నాయి, ఉత్పత్తులు పెంచేస్తున్నాయి.

అక్కడ-మిషన్లకీ, మనుష్యులకీ తేడా కన్పించదు.

వాళ్ళు మరమనుష్యులు, వాళ్ళవి యాంత్రిక జీవితాలు.

## 5

సాయంత్రం-

కార్మికులందరూ పార్కులో గుమిగూడారు, కాసేపు మిషన్స్ ఆపు చేసి. పార్కుని దూరం నించి చూడ్డమే తప్ప, వాళ్ళు సామాన్యంగా అందులోకెళ్ళరు. వెళ్ళాలని కోరికున్నా తీరికుండదు. తీరికున్నా అర్హతుండదొక్కోసారి! దాన్ని మధ్యనే అభివృద్ధి చేశారు. చుట్టూ ముళ్ళ కంచె... ఒక క్రమంలో క్రోటన్స్ మొక్కలూ, మధ్యలో గరికా, చెట్లూ- అందంగా వుంది.

కార్మికులంతా గరికపై కూర్చున్నారు. మేనేజర్- బాదం చెట్టు కానుకుని నించున్నాడు...ఒక్కసారి కళ్ళజోడు సరుకుని, చేతులు కట్టుకున్నాడు యెంతో సంస్కారంగా.

వాతావరణం- తుఫాను ముందున్న ప్రశాంతంలా మారింది.

"కార్మికులారా! మిమ్మల్నందర్నీ సమావేశపర్చిందేమంటే...ప్రధానంగా... ఈ సంవత్సరం వచ్చిన లాభనష్టాల గురించి చెప్పి, మీ బోనస్‌ని డిక్లేర్ చేయడమే. నేను చెప్పబోయే విషయాలన్నీ మీకు తెలిసినవే. ఐనా నా బాధ్యతగా మళ్ళీ చెబుతున్నా...ప్రతీ సంవత్సరం లాగే యీ సంవత్సరం కూడా మీ పనుల్లో ఏమీ అభివృద్ధి లేక పోగా... కొందరి కష్యామోసాలతోనూ, అసమర్థతతోనూ నాలుగు మిషన్స్ పాడయ్యాయి. దీనికి ఉదాహరణగా... మీ సోదరుడు కరీం- రన్నింగులో ఉన్న మిషన్స్‌లో దొంగచాటుగా మేకులు వేసి, బోల్డంత నష్టాన్ని తెచ్చి, ఈ మధ్యనే ఊస్ట్ ఐన సంగతి మీకందరికీ తెలిసిందే...

"అంతే గాకుండా యీ యేడు లాభాల కంటే, నష్టాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. మన సేటు గారి కుటుంబం విదేశ యాత్రలు బోవడం, వారి పెద్ద కూతురి వివాహం జరగడం యీ యేడు ఖర్చే. ఈ పార్కు వేయించడం, మీకు షెడ్ వేయించడం, ఆఫీసు గదుల్ని ఎయిర్‌కండీషన్డ్‌గా మార్చడం, మూడు కొత్త మిషన్స్ తెప్పించడం కూడా ఈ యేడు ఖర్చే.

"ఇలా ఏదో రకంగా మీకూ, ఫ్యాక్టరీకే వుపయోగిస్తున్నాం వచ్చే ఆదాయాన్నంతా. బోనస్ ముందటేడు మీకు 20% ఇస్తామన్నా- యీ యేడు ఎంత ప్రయత్నించినా 10% కంటే ఎక్కువియ్యలేక పోతున్నాం. కాబట్టి...మీరు మా ఇబ్బందుల్నీ, కష్టాల్నీ అర్థం చేసుకుని, మాతో సహకరించి, ఈ బోనస్‌తోనే సంతృప్తి చెందుతారనీ, ఎంత చెట్టుకంత గాలి వుంటుందన్న విషయాన్ని గుర్తిస్తారనీ ఆశిస్తున్నా...

"పక్క కంపెనీలో కార్మికులూ, దుందుడుకు వాదులూ- ఎవరైనా మన సామరస్యాన్ని చెరపాలనీ ప్రయత్నిస్తే- మీరు వాళ్ళకి వ్యతిరేకంగా వుంటూ- మీ పనులు మీరిలాగే కొనసాగించి ముందుకెళ్ళాలనీ, వచ్చే యేడు తప్పకుండా 20% బోనసిస్తామని నమ్ముతున్న-

"ఈ వారం రోజుల్లో మీ జీతాలతో పాటు బోనస్ కూడా యివ్వడం జరుగుతుంది. ఇక మీరే రకమైన గొడవలు చేయకుండా- నిశ్చింతగా- మీ మీ పనుల్లోకి వెళ్ళొచ్చు..." అంటూ వలని గప్పున పైన విసిరిన వేటగాడిలా, స్పీడుగా నిట్టూర్చాడు మేనేజర్.

కార్మికుల్లో కలకలం బయలు దేరింది.

"మేం కష్టపడి పంజేయకుంటె యీయనేవన్నా జేత్తాండా?" అన్నారొకరు.

"పెతి సమ్మచ్చరమున్న బారతఁవే గతి, యీ యేడేం కొత్తా? ఈ తాపేం పూకునేది లేదని, సెప్పండహఁ..." అన్నారు మరొకరు.

"ఇప్పుడు మా అందరి తర్ఫు నుంచి సెంద్రన్న మాట్లాడాలే..." అంటూ అందరూ కేకేశారు. వాళ్ళ ప్రోద్భలం, అవసరం, ఆతృతా-తన బాధ్యతా ముందుకు నెట్టాయతన్ని.

చంద్రం లేచి నించున్నాడు. అతడిలో శాంతి, ఓపికా పూజ్యమై ఆవేశం, అసహనం ప్రత్యక్షమయ్యాయి.

"అయ్యా! తఁవరు పెతి సమ్మచ్చరం ఇట్నే అంటాంద్రు గానీ...మా కొక్కసారి గూడా 20% బోనసియ్యలే. నస్టం...నస్టం...అంటనే...కొత్త మిసన్లూ, తోటలూ, పెండ్లిండ్లూ, తీర్థాలూ, బంగ్లాలూ...లచ్చల రూపాయల కర్సుతో శేత్తారు. మరవన్ని మా కస్టంతో వొచ్చిన రూపాయలూ...లాబాలూ...గాకుంటే యెక్కడియంటరు? మాట వరసకంటా... సేటు బిడ్డ పెండ్లికి బెట్టిన రొండు లచ్చల రూపాయలు గూడా మా కస్టమ్మన్నే యేత్తే...మేం బతకాల్నా? సావాల్నా? ఆఁ...

"కరీం- అన్యాయం జేసిండనీ, మోసం జేసిండనీ...మిసిన్లో మొలలేసిండనీ... సెప్పింద్రు. మరి కరీం సెత్లెందుకు పన్లెకొత్త లేదో సెప్పండ్లి జరా? మీకు దయిర్నం వుంటే... పోరుమన్ను బిలిచి... యేదీ మా ముంగట గట్టిగడుగుండ్లి? నిజం గక్కుతడు... మీరు మా కండ్లనెన్ని దినాలో ముయ్యలేరు సారూ!... ఈ యేడు బోనస్‌తో తాడో పేడో తేల్సుకుంటం. రేపటి దాకా జూసి, మీరిట్నే అంటే... అందరం పనూకొని... స్ట్రయికు మొదలెడతం ఈ తాప మాతరం భయపడి, మీ మాటలు నమ్మి... ఇంగ ఊకోదల్సుకోలే..." అంటూ కచ్చితంగా చెప్పేశాడు చంద్రం ఆవేశంగా.

అందరూ చప్పట్లుకొడుతూ, చంద్రాన్ని కొనియాడుతూ, నవ్వుతూ, కేక లేస్తూ ......వెళ్ళిపోయారు వారివారి పనుల్లోకి.

మేనేజర్-ఎంతో అవమానంగా ఫీలై బుసలుకొడ్తూ వెళ్ళిపోయాడు.

## 6

రాత్రి పదిగంటలు.

చంద్రానికి పిలుపొచ్చింది మేనేజర్ నించి.

ఈసారి మేనేజర్ దగ్గరకెళ్ళడానికి కాస్త జంకాడు చంద్రం, సాయంత్రం తను ఆవేశంగా మాట్లాడిన మాటలు గుర్తొచ్చి. ఐనా పూర్తిగా తేల్చుకునే వరకతనికి శాంతిలేదు.

మేనేజరు గదిలో-రమేశ్, నజీర్ నిలబడివున్నారు. వాళ్ళిద్దరూ మిగతా షిఫ్ట్ నాయకులు. వాళ్ళనెంత సేపాయనో అక్కడికి పిలిపించి. లావా దేవీలన్నీ పూర్తయినట్లున్నాయి. ప్రస్తుతం ఎంతో సిన్సియర్‌గా నించున్నారు, రాబోయే మనిషికి కించిత్తుగూడా అనుమానం రాకుండా.

చంద్రం వెళ్ళి వాళ్ళపక్కనే నించున్నాడు.

మేనేజర్ తలెత్తి తీక్షణంగా చూస్తున్నాడు. ఆ చూపుల్ని తట్టుకోలేక తల దించుకున్నాడు చంద్రం. కాస్త చిరాకూ్కడా వేస్తోంది.

"యేరా చంద్రం! ఉపన్యాసం భలేగా దంచేశావే.... నీ సోదరులు బాగా మెచ్చుకున్నారనుకుంటాను!..." వ్యంగ్యంగా అని "మాకో పెద్ద తలనొప్పిపయ్యా వన్నమాట!" అన్నాడు తలూపుతూ చిన్నగా.

తొందరగా మేల్కొన్నట్లు "ఆఁ...అదిసరే! మీ ముగ్గుర్నిపిలిపించింది వొక అతిముఖ్యమైన పనికి. లాభాలగురించి నన్నేం అడుగొద్దు..."ఎక్కువబోనస"ని వూసే ఎత్తొద్దు...వర్కర్స్‌నించి నాకెలాంటి గొడవలూ రావొద్దు. మీరు ముగ్గురూ వొప్పుకుంటే... ఆ వెధవలేం చేయలేరు. దానికిగానూ...మీ ముగ్గురికి తలా రెండు వేల రూపాయలిస్తా. ఇవి తీసికుని యింతటితో యీగొడవను నొక్కెయ్యండి..." అంటూ సొరుగులోంచి కరెన్సీనోట్లకట్టలు తీసి టేబిల్‌పైనేశాడు మేనేజరు.

అందరి కళ్ళు 'జిగేల్'మన్నాయి ఆ వెల్తుర్లో.

ఆశల నెమళ్ళు పురివిప్పి నాట్యమాడాయి.

వాళ్ళిద్దరూ వెంటనే ఆ రూపాయల్ని తీసుకున్నారు ఆత్రంగా.

చంద్రానికి తన బిడ్డ పెళ్ళిప్పుడే జరిగిపోతున్నట్లు, తనవసరాలన్నీ తీరిపో తున్నట్లూ, కష్టాలన్నీ కడతేరుతున్నట్లూ......కన్పించాయి. కాని ఆ వెంటనే... ఆ నోట్లకట్టలే తోటి కార్మికుల్ని నాగుపాములై కాటువేసినట్లు బాధపడ్డాడు.

"రెండు సంవత్సరాలనించి అల్సర్‌వ్యాధొచ్చి బాధపడుతున్న తన భార్యని-ఈ సంవత్సరమైనా బాగుచేయించి, ఆమె ప్రాణాన్ని కాపాడుకోవాలని......" చూసే జాన్ కళ్ళల్లోని 'ఆతృత' గుర్తొచ్చింది.

"రోజూ వానలో తడుస్తూ...చలిలో వణుకుతూ...కాలం గడుపుతూ, ఈ యేడైనా గూడుకట్టుకోవాలని..." చూసే మల్లయ్య 'దయనీయత' గుర్తొచ్చింది.

"పెళ్ళైనప్పట్నించీ-ఇప్పటివరకూ తీరనికోరికగా మిగిలిన- భార్యకి చీరా, పిల్లలకి గౌన్లూ కుట్టించి, దూరంగావున్న తన భార్య పుట్టింటికి పంపించాలని..." కాంక్షగా చూసే గంపెడు పిల్లల్ల రాజన్న 'దీనత్వం' గుర్తొచ్చింది.

"ఇక నీవే నాకు శరణ్యం! అప్పిచ్చినోడు రెండ్రోజుల్లో నా గుడిసెను

తెల్ల పందుల దొడ్డిగా మార్చుకోబోతున్నాడని......" చేతులెత్తి వున్న జోగులు 'నిస్సహాయత' గుర్తొచ్చింది.

మానవత్వం వున్న చంద్రం మనసు చలించిపోయింది.

బాధలూ, కష్టాలూ తనొక్కడికే కాదు, ప్రతీకార్మిక సోదరుడికీ వున్నాయన్న సంగతి అతన్ని హెచ్చరించింది.

చంద్రం కళ్ళకి—మల్లెచెండులో బాంబుని కప్పిస్తున్నట్లూ... వెండిచెంబులో విషాన్ని దాచిస్తున్నట్లూ... కన్పించాడు మేనేజర్ క్రూరంగా.

ఒక్కసారి తలపైకెత్తి-"సార్! పైసలతో నా నోరుమూయించి నా తమ్ముళ్ళ కడుపులు గొట్టాల్నని సూత్తానవ్. గానీ... జాగ్రత్తసార్! పచ్చిగడ్డితినే పసుని గాదు..." అంటూ గిర్రున వెనక్కి తిరిగి విసురుగా వెళ్ళిపోయాడు చంద్రం.

నిశ్చేష్టులయ్యారు మిగిలిన ముగ్గురు.

## 7

చంద్రం—నిలకడలేకుండా అటూయిటూ తిరుగుతున్నాడు, తన మిషన్ దగ్గర. తలంతా బద్దలయ్యేలా సమ్మెట్లతో కొడుతున్నట్లూ...మండుతున్న పెనంపై వేసి, దిక్కుతోచనీయకుండా దొర్లిస్తున్నట్లూ—బాధపడుతున్నాడు.

గిట్ట ఐపోవస్తోంది. మళ్ళీ గిట్ట దొరకాలంటే పూర్తి ఇంటరెస్ట్ ఆపరేటర్‌దే బొంది. తీగస్టాక్‌లో లేదు. ఓల్డ్‌స్టాక్‌లో వెతకాలి. ఆ తుప్పుపట్టిన తీగనంతా యాసిడ్‌లో శుభ్రంచేసి గిట్టకు చుట్టించాలి. అప్పుడది తనకవసరం.

హెల్పర్—రంగడికోసం చూశాడు చంద్రం.

రంగడు—ట్యాంక్‌లోవున్న వెచ్చని నీటిలో మోకాలానిస్తూ—బాధనుపశమనం చేసుకుంటున్నాడు—నిన్న—15 కిలోల రాగి బెండల్ (తీగచుట్ట) ని యెత్తుకుని, హీటర్ బావిలోంచి పైకొస్తుంటే...మెట్లుజారి కిందబడ్డాడు. అదృష్టవశాత్తు ఆ ప్రమాదం తప్పిపోయింది. ఆ బెండల్ మోకాలుపైబడి లావుగావాచి, నడవడానికి ఇబ్బందిగా వుంది. డ్యూటీకి రాకుండా పస్తులైనా పడుకుందామంటే...కొత్తగా పనికెక్కిన తన్ను నిర్దాక్షిణ్యంగా పన్లోంచి తీసేస్తాడనే భయంతో వచ్చాడు.

అతడి అసహాయతనిచూస్తే జాలేసింది చంద్రానికి—ఈ పరిస్థితిలో అతడు 10 కిలోల రాగితీగను లేపడమసాధ్యమన్న విషయాన్ని గ్రహించాడు.

మిషనాగిపోకుండా చూడమని చెప్పి, తనే బయలుదేరాడు చంద్రం. లోపలిరూంలోకెళ్ళి ఓ తుప్పుపట్టిన రాగిబెండల్‌ని భుజానికెత్తుకున్నాడు. మెట్లని బలవంతంగా ఎక్కి- "అపాయం" అని ఎర్రగారాసున్న రూం తలుపునెట్టుకుని లోపలికెళ్ళాడు.

అందులో ఎవరూలేరు-భుజమ్మీది బెండల్‌ని కిందేశాడు. రూంమధ్యలో, భూమిలోపలిగా అరేంజ్ చేసిన ట్యాంక్‌లో యాసిడ్ బుస బుస పొంగుతోంది.

ఇనుపకడ్డీ కొక్కానికి బెండల్‌ని తగిలించి, ట్యాంక్‌పై అటోకాలు ఇటో కాలు వేసి, బెండల్‌ని జాగ్రత్తగా యాసిడ్‌లోకి దించాడు. 'బుస్సు'న పొంగుతూ రాగితీగకున్న మురికినంతా తినేస్తోంది.

మెల్లగా డోర్ తెరుచుకున్న చప్పుడైంది.

కాళ్ల మధ్యనించి చూచిన చంద్రం ఆశ్చర్యపోయాడు! మేనేజర్!!

"యేం! హెల్పరేమయ్యాడు?" చిన్నగా నవ్వుతూ అడిగాడు మేనేజర్ ముందుకొస్తూ.

"వానికి నొప్పిలేసింది." ఆశ్చర్యంనించి తేరుకుని అన్నాడు చంద్రం, కొంచెం నిర్లక్ష్యంగా తన పని చేసుకుంటూ.

"ఆఁహా! అలాగా?..." అంటూ ఏం తోచక అంతటితో ముగించి, 'పర ధ్యానం'గా ముందుకెళ్ళి కరెంట్ ఫ్యూజుల డబ్బాని తెరిచి, యేదో సర్దినట్లుగాచేసి, మళ్ళీ మూసేశాడు.

వెనుదిరిగి-"తెల్లగా కడుగు! లేకుంటే ప్లాస్టర్ తొందరగా వూడి పోతుంది..." అంటూ చంద్రం వెనక్కొచ్చాడు.

చంద్రానికీసారి జవాబే యివ్వాలన్పించలా.

కాసేపు తటపటాయించాడు మేనేజర్.

చంద్రం-అలాగే వొంగి బెండల్‌ని జాగ్రత్తగా యాసిడ్‌లో దొర్లిస్తున్నాడు. రాగితీగ బంగారంలా మెరుపుకొస్తోంది.

మేనేజర్-ఒక్క వుదుటున ముందుకొచ్చి, బూటుకాలితో గట్టిగా తన్నాడు. చంద్రం ముందుపాదాన్ని.

## 8

ఆరుబయట-పోలుకింద......

తడితడిగా చీము నెత్తుర్లతో తడిసి, భయంకరంగా, పోల్చలేకుండా...... చంద్రం శవం...శవంచుట్టూజనం. అంతులేని ఆవేదనా...అర్థంకాని ఆలోచనా...

చాలసేపైంది. ఒకరితో ఒకరుమాట్లాడం లేదు.

ఎవరికి వారు-కంటతడితో...రక్తం చుక్కలేని మొహాలతో... కదెలా నిలబడి వుండిపోయారు. కొందరు కూర్చుండి పోయారు దిక్కుతోచక.

48

వెక్కిళ్ళ చప్పుళ్ళు...దూరాన మెల్లని ఫ్యాక్టరీల ధ్వనులు తప్ప-భయంకర నిశ్శబ్దం.

ఎందుకో- 'కెవ్వున' ఫ్యాక్టరీ అదిరేలా కేకవేసి, పిచ్చిగా కుంటుకుంటూనే పరుగుతీసిన రంగడు తప్ప-అందరూ రాత్రి 11 గంటలుదాటి 12 ఔతున్నా అలాగే వుండిపోయారు.

మేనేజర్-శవాన్నొకసారి పరీక్షగా చూసి, కొంచెం ఎడంగా వెళ్ళి నించున్నాడు విచారంగా. చివరిగేటు ముందున్న స్త్రీ ఆర్తనాదం-అతన్నప్పుడు చుట్టుముట్టింది. అప్పుడే వచ్చిన రంగడు బయట్నించి గేటెక్కడానికి ప్రయత్నిస్తున్నాడు.

"అయ్యో!... చంద్రం భార్య...గేటు తియ్!..." అన్నాడు మేనేజర్ ఆత్రంగా.

డ్యూటీని మర్చిపోయి- ఎంతో దీనంగా, బాధగా అక్కడే కొయ్యబారి చూస్తూ వుండిపోయిన వాచ్‌మన్- ఒక్కసారిగా పరుగుతీశాడు గేటు వేపు కంగారుగా.

ఆలోచనల్నించీ, దుఃఖాల్నించీ తేరుకున్న తలలు అన్నీ ఒకేమారు గేటు వేపు తిరిగాయి.

సిగ వూడిపోయిన వెంట్రుకలూ, ఎర్రగా కందిపోయిన ముఖమూ, గేటు నూపుతున్న చేతులూ... మట్టిలో దొర్లుతూ ఏడుస్తున్న పిల్లలూ, పిచ్చిగా కేకలూ, వెర్రిగా అరుపులూ, నిస్సహాయమైన బూతులు.

అవి అందరి గుండెల్లో సూటిగా తాకాయి. ఒక్కొక్కరి కళ్ళల్లోంచి రక్తం ద్రవంగా ప్రవహిస్తోంది.

పక్కనున్న వెల్తుర్లో- ఆవిడ గేట్లోంచి విసురుతున్న మట్టిలోంచి పొగలు లేస్తున్నాయి. మండినట్లు మెరుస్తున్న ఆ మట్టిలోంచి పొగలు - గాలికి చువ్వలు దాటి ఫ్యాక్టరీలోకి వీస్తున్నాయి.

---

**వెలువడింది**

1980వ సంవత్సరపు సృజన ఇండెక్స్ జనవరి నుంచి డిసెంబర్ వరకు సృజనలో వచ్చిన రచనల సూచిక.

చందాదారులకు ఉచితం

విడిప్రతి వెల 20 పైసలు

ప్రతులకు : సృజన, హనుమకొండ - వరంగల్ 506 001